


సినిమా థియేటర్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేస్తున్న తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 25 జూన్ 2025 | HYDERABAD

# రెండు రోజులు మోస్తరు వానలు



సిటీబ్యూరో, జూన్ 24, (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్‌లో పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. షేక్‌పేట్‌లో 3.3 మిల్లీమీటర్లు, పటాన్‌చెరు ఎంఆర్‌ఓ కార్యాలయం ప్రాంతంలో 2.8 మిల్లీమీటర్ల వర్షపాతం మంగళవారం రాత్రి వరకు నమోదైంది. ఈ ఆవర్తనం మరింత బలపడే అవకాశముండడంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.4డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24 డిగ్రీలు, గాలిలో తేమ 75శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

# పాలు పగిలాయని ఫిర్యాదు

## సూపర్‌మార్కెట్‌పై కేసు నమోదు

మూసాపేట జూన్ 24 : పాలు విరిగిపోయాయని ఓ కస్టమర్ సూపర్ మార్కెట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సైబర్ సిటీ మరీనా స్కైస్‌లో నివాసముంటున్న రాములు అదే గృహ సముదాయంలోని రత్నదీప్ సూపర్ మార్కెట్లో హెరిటేజ్ మిల్క్ ప్యాకెట్లు కొనుగోలు చేశాడు. ప్యాకెట్‌లోని పాలు వేడి చేయగా అవి విరిగిపోయాయి. ఈ విషయంపై సూపర్ మార్కెట్ సిబ్బందిని ప్రశ్నిస్తే మేము ఏం చేస్తాం.. మాకు సంబంధం లేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో రాములు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# తక్కువ ధరకే బంగారం ఇస్తామంటూ..!

- నకిలీ బంగారం ముఠా భారీ స్కెచ్
- నిందితుల్లో ఒకరు పోలీస్ కానిస్టేబుల్
- 18 మంది ముఠా సభ్యుల అరెస్ట్
- రూ.43లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ రశ్మీ పెరుమాల్

> IVలో



# కన్నబిడ్డలే కాలయములు

- ప్రేమ మోజులోపడి తల్లులను చంపుతున్నారు..
- ప్రియుడితో కలిసి ఘాతుకానికి పాల్పడుతున్న పిల్లలు..
- ఇంటర్‌నెట్ ప్రభావంతో కిరాతంగా మారుతున్నారు..
- వయస్సుతో తేడా లేకుండా క్రిమినల్స్‌గా మారుతున్న కొందరు కూతుళ్లు

> IIలో

జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో మరో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. ఇటీవల సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్‌లో సీసీ రోడ్డు వేయకుండానే వేసినట్లు బిల్లులు పెట్టి సంస్థ ఖజానాకు రూ. 8.93 లక్షల టోకరా వేసిన ఘటనలో జీహెచ్‌ఎంసీకి చెందిన ఏఈ అన్సారీని విధుల నుంచి టర్మినెట్ చేశారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఏకాంబరంపై సస్పెన్షన్ వేటు వేస్తూ కమిషనర్ ఆర్వీ కర్ణన్ నిర్ణయం తీసుకున్నారు. సదరు కాంట్రాక్ట్ సంస్థ నుంచి డబ్బులను రికవరీ చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ ఘటన మరువకముందే ఇదే ఐఎస్ సదన్ డివిజన్‌లో మరో అవినీతి బాగోతం బట్టబయలైంది. వరద నీటి కాలువ ఆధునీకరణ పనులు పూర్తి చేయకుండానే రూ. 53.59 లక్షల బిల్లులు స్వాహా చేశారు. కాంట్రాక్టర్, ఇంజినీర్లు మేజర్‌మెంట్(ఎంబీ)లో రికార్డులు సృష్టించి ఖజానాకు గండి కొట్టారు.

# పని చేయకుండానే బిల్లు కొట్టేశారు!!

## బల్దియా ఖజానాకు రూ.53.59 లక్షల గండి



సిటీబ్యూరో/సైదాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : వరద నీటి కాలువ ఆధునీకరణ పనులు చేయకుండానే.. చేసినట్లుగా దొంగ రికార్డులు సృష్టించి బిల్లులను స్వాహా చేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్లు సిద్ధమయ్యారు. తూతూ మంత్రంగా పనులు చేసినట్లు చూపించి మొత్తం బిల్లులను కాజేసే కుట్రకు తెరలేపారు. ఐఎస్ సదన్ డివిజన్‌లో ఇంజినీరింగ్ అధికారుల అవినీతి మరో సారి వెలుగులోకి వచ్చింది. నెల రోజుల క్రితం జీహెచ్ ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మకై సీసీ రోడ్డు వేయకుండానే రూ. 10 లక్షలు స్వాహా చేసిన విషయం మర్చిపోకముందే, అదే తరహా మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని దామోదర సంజీవయ్య నగర్‌లో వర్షాకాలంలో తరచూ ఎదురవుతున్న వరదనీటి ఇబ్బందులను నివారించేందుకుగాను ప్రస్తుతం ఉన్న నాలాను బాక్స్ డ్రైన్‌గా నల్ల పోచమ్మ టెంపుల్ నుంచి ఎక్సైజ్ కాలనీ వరకు బాక్స్ డ్రెయిన్ ఆధునీకరణకు రూ. 90 లక్షలు కేటాయించి టెండర్లను ఆహ్వానించారు. బాక్స్ డ్రెయిన్ టెండర్లను సైదులు నాయక్ అనే కాంట్రాక్టర్ వాటి పనులను 2021 జూన్‌లో స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేత, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొని పనులను ప్రారంభించారు. రెండు రోజుల పాటు కొద్ది పనులను తూతూ మంత్రంగా మొదలుపెట్టి నాలుగు పైపులు వేసి అలాగే వదిలేశాడు. ఈ విషయాన్ని స్థానికులు అధికారులను, కాంట్రాక్టర్‌ను అడగగా తాను అనారోగ్యంతో ఉన్నానని కోలుకోగానే పనులను ప్రారంభించి పూర్తి చేస్తానని వారికి నచ్చజెప్పాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు బాక్స్ డ్రెయిన్ ఆధునీకరణ నిర్మాణ పనులు చేయకుండానే, పనులు చేసినట్లు మేజర్‌మెంట్ (ఎంబీ)లో ఇటీవల రికార్డులు సృష్టించి బిల్లులు పెట్టి రూ.53 లక్షలు, 59 వేల 330 రూపాయలు కాజేసేందుకు ప్రయత్నాలు పెట్టి స్వాహా చేసినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని స్థానిక కార్పొరేటర్ ఆర్టీఐ ద్వారా సమాచారం తీసుకోగా ఈ అవినీతి తంతు వెలుగులోకి రావడం గమనార్హం. ఒక్క డివిజన్‌లోనే ఇలాంటి అక్రమాలు జరుగుతుంటే మిగిలిన 149 డివిజన్లలో ఏ మేరలో అక్రమాలు జరిగాయన్న చర్చ లేకపోలేదు. లక్షల జీతాలు తీసుకునే ఇంజనీర్లు అక్రమార్జనకు బరితెగించడంపై తీవ్ర చర్చ జరుగుతున్నది. అవినీతి సొమ్ముకు అలవాటు పడి ఇటీవల కొందరు ఏసీబీకి చిక్కుతున్న.. ఇంజనీర్లలో ఏ మాత్రం మార్పు కనబడకపోవడం విస్మయం వ్యక్తం చేస్తున్నారు

- అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు
- ఐఎస్ సదన్ డివిజన్‌లో మరో అవినీతి బాగోతం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ శ్వేత డిమాండ్
- ఇటీవల రూ.8.93 లక్షల టోకరా ఘటనలో ఇద్దరిపై వేటు
- అక్రమార్జనలో ఇంజినీర్లు, ఏసీబీకి చిక్కుతున్న మారని తీరు

### వెలుగులోకి వచ్చిందిలా..

డీఎస్ నగర్‌లోని పోచమ్మ ఆలయం నుంచి సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ వరకు వరద నీటి కాలువ బాక్స్ డ్రైన్ ఆధునీకరణ పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేస్తున్నట్లు తెలియడంతో జంగం శ్వేతా రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసింది. డీఎస్ నగర్‌లో వరద నీటి కాలువ పనులు నిర్మాణానికి 2021 జూన్‌లో రూ .90 లక్షల నిధులు మంజూరై టెండర్ పక్రియ పూర్తి చేశారు. కానీ జీహెచ్ ఎంసీ అధికారుల అండతో పనులు చేయకుండానే చేసినట్లు అధికారుల తప్పుడు రికార్డులు మిగతా IIవ పేజీలో



నాలా పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్

# యుద్ధ ప్రాతిపదికన నాలా పూడికతీత

## కార్పొరేటర్ ధర్నా.. దిగొచ్చిన అధికారులు

గోల్నాక, జూన్ 24 : సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ సోమవారం ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. డివిజన్ పటేల్ నగర్ చౌరస్తాలోని సీపీఎల్‌కి ఆనుకొని ఉన్న ప్రేమ్ నగర్ నాలా రిటైర్నింగ్ వాల్ నుంచి కొన్నినెలలుగా మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో స్థానికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ బీఆర్‌ఎస్ నాయకులతో కలసి ధర్నా చేపట్టారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు నాలా వద్ద సమస్యను పరిశీలించి యద్ధ ప్రాతిపదికన పూడిక తీత పనులు చేపట్టారు. ఈ పనులను కార్పొరేటర్ దగ్గరుండి పరిశీలించారు. వీలైనంత త్వరగా నాలా ప్రహరీ నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లవంగు ఆంజనేయులు, రంగు సతీశ్ గౌడ్, మహేశ్ ముదిరాజ్, అజర్, శ్రావణ్, సంతోష్ చారి, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

# ఏ నిమిషానికి.. ఏమి జరుగునో

- శిథిలావస్థలో ఉస్మానియా నర్సింగ్ కళాశాల హాస్టల్
- పెచ్చులూడుతున్న సీలింగ్, గోడలకు పగుళ్లు
- ప్రమాదకరంగా కరెంట్ తీగలు, అధ్వానంగా మరుగుదొడ్లు
- భయం గుప్పిట్లో విద్యార్థినులు

'మా హాస్టల్ గుర్తుకొస్తే చచ్చేటంత భయం.. దాని కంటే పశువుల పాక ఎంతో నయం' ..శిథిలావస్థకు చేరిన భవనంలో పెచ్చులూడుతున్న సీలింగ్, గోడలకు ఏర్పడిన పగుళ్లు, అస్తవ్యస్తంగా విద్యుత్ తీగలు, చినుకు పడితే ఎక్కడ పైకప్ప కూలిపడిపోతుందో అనే భయం గుప్పిట్లో విద్యార్థులు హడలిపోతున్నారు. శుభ్రత పాటించాలి అని ప్రజలకు చెప్పే వైద్య విద్యార్థినులు నివాసం ఉండే ఆ హాస్టల్‌లో అడుగడునా ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఉస్మానియా దవాఖానలోని నర్సింగ్ కళాశాల వసతి భవనం పరిస్థితి. ఉస్మానియా నర్సింగ్ కళాశాల విద్యార్థుల వసతి గృహంపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక స్టోరీ ...



సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): 1951లో నిర్మించిన ఉస్మానియా నర్సింగ్ కళాశాల వసతి భవనం ప్రస్తుతం పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరింది. భవనంలో ఎక్కడిక్కడ పెచ్చులూడుతున్నాయి. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఏ నిమిషానికి ఏమి జరుగుతుందో.. ఏ మూలన పెచ్చులూడి తమ మీద పడతాయో అని నర్సింగ్ విద్యార్థినులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తమ చదువు కొనసాగిస్తున్నారు. నర్సింగ్ కళాశాల వసతి గృహంలో ఉన్న మూడు బ్లాకుల్లో 180 మంది జనరల్ నర్సింగ్, 50 మంది బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినులు ఉంటూ ఉస్మానియా మిగతా IIవ పేజీలో

ఉస్మానియా నర్సింగ్ కళాశాల విద్యార్థుల హాస్టల్ భవనం (ఇన్‌సెట్‌లో) పెచ్చులూడిన భవనం పైకప్ప

# మేం ఇచ్చిన లిస్టే ఫైనల్ చేయాలి

> IVలో

ప్రభుత్వ పథకాల వర్తింపులో కాంగ్రెస్ నేతల జోక్యం!



# ఆ కుటుంబంలో ఖాకీ చిచ్చు..!

## బెల్ట్ షాపు నిర్వాహకుడి భార్యపై కన్నేసిన కానిస్టేబుల్

- కేసులు పెట్టొద్దంటే.. నువ్వేకావాలి...
- బెదిరించి మహిళను లొంగదీసుకున్న ఖాకీ
- షాపు నిర్వాహకుడు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- బాధపడి ఆత్మహత్యాయత్నం చేసిన బాధితుడి కూతురు..
- ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రిలో చికిత్స
- పాతబస్తీ ఏరియాలో ఓ టాస్క్‌ఫోర్స్ పోలీస్ అరాచకం ఇది



సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): తాను పనిచేసే ప్రాంతంలో అక్రమ దందాలపై ఆ కానిస్టేబుల్ దృష్టి పెడతాడు.. ఒకవైపు డబ్బుల వసూళ్లతో పాటు అక్రమ దందాలపై దాడులు చేసి కేసులు పెట్టొద్దంటే మీరు కావాలంటూ అక్కడి మహిళలను లొంగదీసుకుని.. వారి కుటుంబాల్లో చిచ్చు పెడతాడు.. పాతబస్తీలోని ఓ ప్రాంతంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి పోలీసులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో పాటు కానిస్టేబుల్ అరాచకానికి ఆ నిర్వాహకుడి కుమార్తె ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో విషయం బయటకు వచ్చింది. ఇటీవల పోలీస్‌స్టేషన్ల సరిహద్దులు మారడంతో ఆ ఏరియా పోలీస్‌స్టేషన్ మారిపోయింది. దీంతో గతంలో పాత స్టేషన్‌లో, తాజాగా కొత్త స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేసినా తిరిగి పోలీసులు బాధితుడినే ఇబ్బంది పెడుతున్నారు తప్ప.. తమ డిపార్ట్‌మెంట్‌కు చెందిన మిగతా IIవ పేజీలో


# బీఆర్‌ఎస్ పోరు.. దిగొచ్చిన సర్కారు..

## ఆ తొమ్మిది మండలాల రైతులకు రైతుభరోసా



### మంగళవారం సాయంత్రం నుంచే రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమ

రంగారెడ్డి, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ పోరాటం ఫలించింది. జిల్లాలోని శివారు ప్రాంతాల రైతులకు రైతుభరోసా పెట్టుబడి సాయం వారి ఖాతాల్లో జమ అవుతున్న ది. జిల్లాలోని తొమ్మిది మండలాల్లో వ్యవసా యం చేయడంలేదన్న సాకుతో రాష్ట్ర ప్రభు త్వం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని నిలిపేయగా.. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షు డు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆ తొమ్మిది మండలాల్లో సాగవుతున్న వరి, కూరగాయల పంటలకు సంబంధించిన పూర్తి ఆధారాలను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందించి.. రైతుభరోసా ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. శివారు మండలాల రైతు భరోసాపై సమీక్షిస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. అయినప్పటికీ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో స్పం దించకపోవడంతో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామా ల్లో రైతు భరోసా ఇవ్వాలని ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో తులేకలాన్, మాజీ ఎంపీపీ కృపేశ్, మిగతా IVవ పేజీలో



### బీఆర్‌ఎస్ పోరాట ఫలితంగానే..

జిల్లాలోని తొమ్మిది శివారు మండలాల్లో వ్యవసాయం చేయడంలేదన్న సాకుతో ప్రభుత్వం రైతుభరోసాను ఎగ్గొట్టాలని యత్నించింది. అయితే దీనిపై తాము వెం టనే స్పందించి శివారు మండలాల్లో సాగవుతున్న పంటల వివరాలను పూర్తి ఆధారాలతో ప్రభుత్వానికి అందించాం. రైతులకు కచ్చితంగా పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయాలని..లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించాం. అయినా ప్రభుత్వం నాన్చివేత ధోరణిని అనుసరించడంతో అనేక గ్రామాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం దిగొచ్చి రైతుభరోసాను విడుదల చేసింది. కానీ, అర్హులందరికీ ప్రభుత్వం రైతుభరోసా పంపిణీ చేయకుండానే సంబురాలు చేసుకోవడం ఆక్షేపణీయం. కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలిచ్చి అన్ని వర్గాలను మోసం చేస్తున్నది. కాంగ్రెస్ హయాంలో వ్య వసాయం దండుగలా మారింది. రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పి.. కొందరికే చేసింది. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని, ఇప్పటికీ రైతులకు ఇవ్వలేదు. రైతులకు వెంటనే బోనస్ పంపిణీ చేయాలి. లేకుంటే మరో ఉద్యమాన్ని ప్రారంభిస్తాం.



-సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే




బడంగ్ పేట్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్లు

# టెండర్లలో గోల్‌మాల్

## బడంగ్ పేట్ కార్పొరేషన్ ఎదుట కాంట్రాక్టర్ల ధర్నా

- టెండర్లలో పారదర్శకత పాటించడం లేదని మండిపాటు
- అధికారులకు అనుకూలంగా ఉన్నవారికే పనులు
- 200 పనులకు టెండర్లు పూర్తి చేయలేదని ఆరోపణ

బడంగ్‌పేట్, జూన్ 24: బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా లేదని కాంట్రాక్టర్లు ధర్నాకు దిగారు. టెండర్లు రద్దు చేయడంపై కాంట్రాక్టర్లు అసహనం వ్యక్తం చేశారు. గతంలో తీర్మానాలు చేసిన 200 పనులకు టెండర్ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి చేయలేదని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్ టెండర్లలోను గోల్ మాల్ చేస్తున్నారని కాంట్రాక్టర్లు పట్నం శ్రీశైలం, విజయ్ కుమార్, సాయి కిరణ్, శ్రీనివాస్ తదితరులు ఆరోపించారు. ప్రతిసారి అడ్వాన్స్ వర్కులు పెట్టడంపైన వారు తప్పు పట్టారు. అధికారులకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లకు నామినేట్ పనులు ఇస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు చెప్పిన వారికే కాంట్రాక్టులు వస్తున్నాయని ఆరోపించారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మిగతా IIవ పేజీలో